16- 9- 26 rakshana_praja jyothi Medhak.qxd 10/20/2026 4:43 AM Page 1

మన రాజధాని

రక్షణ

నిజం మా బలం

బాపట్ల | గుంటూరు | పల్నాడు

మంగళవారం 20 అక్టోబర్ 2026 పేజీలు : 4

మూడు రకాల ఎన్నికలు.. సిబ్బంది ఒక్కటే!

విధులకు గైర్హాజరైతే సస్పెన్షన్ తప్పదు..

కలెక్టర్ సాయికాంత్ వర్మ హెచ్చరిక

మున్సిపాలిటీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అందుబాటులో ఉన్న సిబ్బందినే వినియోగించేం దుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహించినా, గైర్హాజరైనా చర్యలు తప్పవని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.ఎం. సాయికాంత్ వర్మ హెచ్చరించారు. విధు లకు రాని ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. పోలిం గ్ కేంద్రాల గుర్తింపు నుంచి కౌంటింగ్ ఏర్పా ట్ల వరకు అధికారు లు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని ఆదేశించారు.

వివరాలు 4లో..

దసరోత్సవం..

దహించాల్సింది రావణుని కాదు... దుర్గనాలను

చెడుపై మంచి విజయం ఒక్కరోజుకే పరిమితం కాకూడదు..

ప్రతి మనిషి జీవితంలోనూ ఆ మార్పు కనిపించాలి

చెడుపై విజయం.. మనలోనే మొదలవ్వాలి!

దసరా అంటే రావణ దహనం.. అమ్మవారి ఆరాధన.. విజయ సంబరాలు మాత్రమే కాదు! మనిషిలోని అహంకారంపై ఆత్మవిశ్వాసం, ద్వేషంపై ప్రేమ, అన్యాయంపై ధర్మం సాధించే విజయం. ఏటా చెడును దహనం చేస్తున్నాం.. మరి మనలోని స్వార్థాన్ని, అసూయను, అహంకారాన్ని దహనం చేస్తున్నామా? దేవతలను పూజించే చేతులు ఆడబిడ్డను గౌరవిస్తున్నాయా? పండుగ వెలుగులు పేదవాడి ఇంటా విరజిమ్ముతున్నాయా? ఈ ప్రశ్నలకు మన ఆచరణే సమాధానం కావాలి. మనసులో మానవత్వం.. మాటలో మాధుర్యం.. చేతల్లో ధర్మం.. సమాజంలో సమానత్వం వెల్లివిరిసినప్పుడే విజయదశమికి నిజమైన సార్థకత. చెడుపై మంచి విజయం ఒక్కరోజు వేడుక కాకూడదు.. ప్రతి మనిషి జీవితంలో నిరంతర స్ఫూర్తి కావాలి!

వివరాలు 2లో..

మేయర్ బరిలో 19..
ఉపసంహరణపైనే ఉత్కంఠ!

ఎన్నికల్లో నామినేషన్ల పరిశీలన పూర్తి.. 20లో ఒకటి తిరస్కరణ

19నామినేషన్లలో స్వతంత్రులే నలుగురు.. 21న తేలనున్న తుది చిత్రం

గుంటూరు మేయర్ పీఠం చుట్టూ రాజకీయ చదరంగం రసవత్తరంగా మారుతోంది. నామినేషన్ల పరిశీలనలో ఒకటి తిరస్కరణకు గురికావడంతో 19 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ప్రధాన పార్టీల నుంచి మూడేసి నామినేషన్లు ఉం డగా.. నలుగురు స్వతంత్రులు బరిలో నిలిచారు. దీంతో పోటీ ముఖచిత్రం ఆసక్తికరంగా మారి ంది. అయితే అసలు రాజకీయ వ్యూహాలకు ఉపసంహరణ గడువే కీలకం కానుంది. ఎవరిని బరిలో కొనసాగిస్తారు.. ఎవరికి దారిస్తారు.. ఏకాభిప్రాయానికి వస్తారా? అన్న చర్చలు ఊపందుకున్నాయి. ఈ నెల 21న తుది జాబితా వెలు వడిన తర్వాతే మేయర్ పోటీపై స్పష్టత రానుంది.



వివరాలు 2లో..

విజయదశమి స్ఫూర్తితో ప్రగతి పథంలో సాగాలి

బాపట్ల జిల్లా ప్రజలకు మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్ శుభాకాంక్షలు

వివరాలు 2లో..

చెడుపై మంచి విజయానికి ప్రతీక అయిన విజయదశమి ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలను నింపాలని రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్ ఆకాంక్షించారు. బాపట్ల జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలుపుతూ.. పండుగ స్ఫూర్తితో ఐకమ త్యం, సోదరభావంతో ముందుకు సాగాలని పిలుపుని చ్చారు. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజల ఆకాంక్షలు నెరవేరి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని కోరుకున్నారు.

వివరాలు 2లో..

గుంటూరు అభివృద్ధే లక్ష్యం..

అందరినీ కలుపుకొని ముందుకు!

మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పించిన నాయకత్వానికి కృతజ్ఞతలు..

కార్యకర్తలే కూటమి బలం:

కోవెలమూడి లక్ష్మీ అపర్ణ

గుంటూరు నగర అభివృద్ధికి కొత్త దిశా నిర్దేశం చేస్తామంటూ కూటమి మేయ ర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ ముందుకు సాగుతున్నారు. మహిళల కు రాజకీయాల్లో ప్రాధాన్యమిస్తూ తన కు అవకాశం కల్పించిన నాయ కత్వా నికి కృతజ్ఞతలు తెలుపుతూనే.. నగర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తానని స్పష్టం చేశారు. వార్డుల స్థాయిలో సమస్యల గుర్తింపు, మౌలిక సదుపా యాల మెరుగుదలే లక్ష్యంగా పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తల సమన్వ యంతో ప్రజల విశ్వాసాన్ని చూరగొంటానని ధీమా వ్యక్తం చేశారు. మేయర్ పీఠం దక్కితే అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తానని తెలిపారు.

16- 9- 26 rakshana_praja jyothi Medhak.qxd 10/20/2026 4:43 AM Page 2

మేయర్ బరిలో 19.. ఉపసంహరణపైనే ఉత్కంఠ!

గుంటూరు: రక్షణ బ్యూరో

నగరపాలక సంస్థ మేయర్ పీఠం చుట్టూ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఎన్నికల బరిలో నిలిచేందుకు దాఖలైన నామినేషన్ల పరిశీలన పూర్తికావడంతో పోటీ స్వరూపం స్పష్టమవుతోంది. మేయర్ పదవికి దాఖలైన 20 నామినేషన్లలో ఒకటి తిరస్కరణకు గురికాగా, మిగిలిన 19 అర్హత సాధించాయి. దీంతో తదుపరి అంకమైన నామినేషన్ల ఉపసంహరణపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు సైతం బరిలో ఉండటంతో తుది పోటీ ఎలా ఉండబోతోందన్నది చర్చనీయాంశంగా మారింది.అర్హత సాధించిన నామినేషన్లలో తెలుగుదేశం పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీల నుంచి మూడేసి చొప్పున ఉన్నాయి. బీఎస్పీ నుంచి ఒకటి, నవరంగ్ కాంగ్రెస్ నుంచి ఒకటి, నవతరం పార్టీ నుంచి ఒకటి, రీఫామ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఒకటి, నవోదయం పార్టీ నుంచి ఒకటి, అమరావతి పార్టీ నుంచి ఒకటి నామినేషన్ అర్హత పొందాయి. స్వతంత్ర అభ్యర్థుల నుంచి నాలుగు నామినేషన్లు ఆమోదం పొందాయి. ప్రధాన పార్టీల మధ్య పోటీతోపాటు ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు రంగంలో ఉండటం ఎన్నికల ఆసక్తిని పెంచుతోంది.మేయర్ పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా ప్రధాన పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. అభ్యర్థుల ఎంపిక, స్థానిక రాజకీయ సమీకరణాలు, నాయకుల మధ్య సమన్వయం వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. ఇప్పటికే మేయర్ అభ్యర్థుల ఎంపికపై పార్టీల్లో కసరత్తు జరిగిన నేపథ్యంలో ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాతే పోటీలో మిగిలే అభ్యర్థులపై స్పష్టత రానుంది.రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం మున్సిపల్ ఎన్నికలు--2026లో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయిందని నగర కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కె.మయూర్ అశోక్ తెలిపారు. ఎన్నికల నిబంధనలు--2005 ప్రకారం అర్హత పొందిన నామినేషన్ల జాబితాలను రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ప్రచురించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 21న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం తుది అభ్యర్థుల జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు.మొత్తంగా 19 నామినేషన్లు అర్హత పొందినా, తుది బరిలో ఎంతమంది నిలుస్తారన్నది ఉపసంహరణతో తేలనుంది. అప్పటివరకు అభ్యర్థుల మధ్య చర్చలు, పార్టీల అంతర్గత సమాలోచనలు కొనసాగే అవకాశముంది. మేయర్ ఎన్నికల రాజకీయంలో తదుపరి అడుగు ఎటువైపు పడుతుందన్న ఉత్కంఠ గుంటూరు నగర రాజకీయ వర్గాల్లో నెలకొంది

విజయదశమి స్ఫూర్తితో ప్రగతి పథంలో సాగాలి

బాపట్ల, రక్షణ న్యూస్..

: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అయిన విజయదశమి పండుగ ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు నింపాలని రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్ ఆకాంక్షించారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని బాపట్ల జిల్లా ప్రజలకు వారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజలందరికీ విజయాలు, శాంతి, సౌభాగ్యం, అభివృద్ధి చేకూరాలని ఆకాంక్షించారు.విజయదశమి ధర్మానికి, సత్యానికి ప్రతీకగా నిలుస్తుందని మంత్రులు పేర్కొన్నారు. పండుగ స్ఫూర్తితో ప్రజలందరూ ఐకమత్యం, సోదరభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత అభివృద్ధితోపాటు రాష్ట్ర ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సమాజంలో శాంతి, సామరస్యం వెల్లివిరియాలని, ప్రజల ఆశయాలు నెరవేరి ప్రతి ఇంటా పండుగ వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వేర్వేరు ప్రకటనల్లో ఈ మేరకు శుభాకాంక్షలు తెలిపారు.

దసరోత్సవం...

మొదటి పేజీ తరువాయి

రక్షణ డెస్క్ స్పెషల్

దసరా.. పది రోజుల పండుగ మాత్రమే కాదు. మనిషిలోని అహంకారంపై ఆత్మవిశ్వాసం సాధించే విజయం. అన్యాయంపై ధర్మం చేసే పోరాటం. అజ్ఞానంపై జ్ఞానం సాధించే జయం. అమ్మవారి అలంకారాలు, ఆలయాల్లో పూజలు, వీధుల్లో సందడి, ఇళ్లలో పిండివంటలు.. ఇవన్నీ పండుగకు కనిపించే అందాలు. కానీ ఈ వేడుకల వెనుక దాగి ఉన్న అసలైన సందేశాన్ని మనం ఎంతవరకు ఆచరిస్తున్నామన్నదే అసలు ప్రశ్న. చెడుపై మంచి గెలిచిందని ఏటా సంబరాలు చేసుకుంటున్నాం. మరి మనలోని చెడు ఆలోచనలపై మనం విజయం సాధిస్తున్నామా? సమాజంలో అన్యాయం, అసమానతలు, అవినీతి, వివక్షలపై ధర్మం గెలిచేలా మన వంతు ప్రయత్నం చేస్తున్నామా?దుర్గామాత మహిషాసురుడిని సంహరించిన గాథ కేవలం పురాణ ఘట్టం కాదు. దుష్టశక్తులు ఎంత బలంగా ఉన్నా.. ధర్మం, ధైర్యం, సంకల్పం కలిసినప్పుడు వాటిని ఎదుర్కోవచ్చనే నమ్మకానికి ప్రతీక. శ్రీరాముడు రావణుడిపై సాధించిన విజయం కూడా అదే చెబుతుంది. రావణుడికి అపారమైన జ్ఞానం, శక్తి, సంపద ఉన్నా.. అహంకారం అతడి పతనానికి కారణమైంది. అంటే మనిషి ఎంత ఎదిగినా వినయం కోల్పోకూడదని, అధికారం ఎంత ఉన్నా ధర్మాన్ని విడిచిపెట్టకూడదని ఈ పండుగలు బోధిస్తున్నాయి. ఈ సందేశం నేటి సమాజానికి మరింత అవసరం.నవరాత్రుల్లో అమ్మవారిని తొమ్మిది రూపాల్లో పూజిస్తాం. శక్తికి, ధైర్యానికి, కరుణకు, జ్ఞానానికి ప్రతిరూపంగా కొలుస్తాం. మరోవైపు మహిళలపై దాడులు, బాలికలపై అఘాయిత్యాలు, వరకట్న వేధింపులు, వివక్ష ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. దేవతను పూజించే చేతులే మహిళను గౌరవించేలా మారినప్పుడే దసరా స్ఫూర్తికి నిజమైన అర్థం లభిస్తుంది. ఆడపిల్లకు విద్య, భద్రత, సమాన అవకాశాలు కల్పించడం కూడా అమ్మవారికి చేసే ఆరాధనతో సమానమే. పండుగ పూజామందిరంలోనే కాకుండా మన ఆలోచనల్లోనూ మొదలవ్వాలి.దసరా అంటే కొత్త ఆరంభాలకు కూడా సంకేతం. విజయదశమి రోజున విద్యాభ్యాసం ప్రారంభించడం, కొత్త పనులకు శ్రీకారం చుట్టడం మన సంప్రదాయం. ఈ ఆచారం వెనుక ఉన్న అంతరార్థం స్పష్టమే.. మంచి పనిని ప్రారంభించడానికి సంకల్పం కావాలి. ఆ సంకల్పాన్ని విజయంగా మార్చడానికి కృషి అవసరం. విద్యార్థులు క్రమశిక్షణతో చదవడం, యువత నైపుణ్యాలను పెంపొందించుకోవడం, రైతులు ఆధునిక పద్ధతులను అందిపుచ్చుకోవడం, ఉద్యోగులు నిజాయతీగా విధులు నిర్వర్తించడం.. ఇవన్నీ విజయదశమి స్ఫూర్తిని జీవితంలో ఆచరించడమే. ఒక్కరోజు ఆయుధపూజ చేసి ఆగిపోకుండా, మన చేతిలోని పనిముట్టును సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలి.పండుగల అసలైన అందం సామాజిక ఐక్యతలోనూ కనిపిస్తుంది. కులం, మతం, ప్రాంతం, ఆర్థిక స్థితి వంటి భేదాలను పక్కనపెట్టి ఒకరినొకరు పలకరించుకోవడం, పేదలతో ఆనందాన్ని పంచుకోవడం, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం దసరా నేర్పే గొప్ప విలువలు. పండుగ వేళ కొత్త బట్టలు కొనలేని కుటుంబాన్ని ఆదుకోవడం, ఒంటరిగా ఉన్న వృద్ధులను పలకరించడం, పేద విద్యార్థికి పుస్తకాలు అందించడం వంటి చిన్న పనులే సమాజంలో పెద్ద మార్పునకు పునాదులు వేస్తాయి. పండుగ ఖర్చులో కొంత భాగాన్ని సేవకు కేటాయిస్తే ఆ ఆనందం మరింత మందికి చేరుతుంది.మరోవైపు పండుగ సంబరాలు పర్యావరణానికి భారంగా మారకూడదు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకపోవడం, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడం, సంప్రదాయాలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా వేడుకలు నిర్వహించడం మనందరి బాధ్యత. భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం కూడా ధర్మమే.దసరా మనకు ఇచ్చే అసలైన పిలుపు ఒక్కటే.. రావణుడిని బయట వెతకడం కంటే మనలోని అహంకారాన్ని గుర్తించాలి. మహిషాసురుడిని సంహరించిన అమ్మవారి శక్తిని కీర్తించడంతోపాటు మనలోని భయాన్ని, బలహీనతను, స్వార్థాన్ని జయించాలి. ప్రతి ఇంట్లో ఆనందం వెల్లివిరియాలి.. ప్రతి మహిళకు భద్రత లభించాలి.. ప్రతి బిడ్డకు విద్య అందాలి.. ప్రతి పేదవాడికి గౌరవప్రదమైన జీవితం దక్కాలి. అప్పుడు మాత్రమే దసరా పండుగ ఒక ఆచారంగా కాకుండా సామాజిక మార్పుకు నాందిగా నిలుస్తుంది. చెడుపై మంచి విజయం పది రోజులకే పరిమితం కాకుండా.. ఏడాది పొడవునా మన ప్రవర్తనలో ప్రతిఫలించాలి. అదే విజయదశమి అసలైన విజయం!

గుంటూరు అభివృద్ధే లక్ష్యం..

మొదటి పేజీ తరువాయి

గుంటూరు రక్షణ బ్యూరో...

గుంటూరు నగర అభివృద్ధి.. ప్రజల ఆకాంక్షలే ప్రాధాన్యం.. కూటమి నాయకులు, కార్యకర్తల సమన్వయమే ముందడుగు! మేయర్ అభ్యర్థిగా అవకాశం దక్కడంతో తన ముందున్న బాధ్యతను గుర్తుచేస్తూ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ అభివృద్ధి అజెండాను తెరపైకి తెచ్చారు. మహిళలకు రాజకీయాల్లో ప్రాధాన్యమిస్తూ తనకు అవకాశం కల్పించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూనే.. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ నగర ప్రగతికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన 'చెప్పాం.. చేస్తున్నాం' పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నగర అభివృద్ధి ఒక్కరి వల్ల సాధ్యమయ్యేది కాదని, అన్ని వర్గాల భాగస్వామ్యం, నాయకులు, కార్యకర్తల సహకారం అవసరమని పేర్కొన్నారు. వార్డుల స్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి, వారి ఆకాంక్షలను తన దృష్టికి తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజల విశ్వాసాన్ని పొందేలా సమన్వయంతో పనిచేస్తామని, మేయర్‌గా అవకాశం లభిస్తే మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తానని తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తూ తనకు ఈ అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి విజయానికి కార్యకర్తల కృషి కీలకమని, వారి సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్లా మాధవి, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, నిమ్మల శేషయ్య, పార్టీ పరిశీలకుడు చిరుమామిళ్ల మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల దినోత్సవానికి అధికారుల సన్నాహాలు

ఏర్పాట్లను పరిశీలించిన జాయింట్ కలెక్టర్, ఎస్పీ వకుల్ జిందాల్.

గుంటూరు రక్షణ న్యూస్

పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని ఈ నెల 21న మంగళగిరిలోని 6వ ఏపీఎస్పీ బెటాలియన్ మైదానంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరయ్యే అతిథులు, పోలీసు అమరవీరుల కుటుంబాలకు అవసరమైన వేదిక, కూర్చునే సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. తాగునీరు, వైద్య శిబిరాలు, మరుగుదొడ్ల ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ కార్యక్రమానికి

హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.టి.వి. రవికుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మక్కెన పద్మావతి, పోలీసు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై అధికారుల తనిఖీ

చీరాల రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియతో పాటు ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను బాపట్ల జిల్లా ఎన్నికల పర్యవేక్షణ అధికారి ఎ.ఎ.ఎల్. పద్మావతి పరిశీలించారు. సోమవారం చీరాల మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ఆమె నామినేషన్ల స్వీకరణ తీరును, అధికారుల విధుల నిర్వహణను సమీక్షించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్, ఎన్నికల సామగ్రి పంపిణీ, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, బారికేడ్ల వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన రూట్ మ్యాప్‌లను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్నికల వేళ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఎన్నికల విధులను

సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. భద్రతా ఏర్పాట్లపై స్థానిక డీఎస్పీతో ప్రత్యేకంగా సమావేశమైన ఆమె, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ డానియల్, డీఎస్పీ ఎం.డి. మోయిన్, తహసీల్దార్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

డీఎస్పీ అబ్దుల్ అజీజ్

రేపల్లె రక్షణ న్యూస్

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని రేపల్లె డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. రానున్న ఎన్నికల ప్రక్రియ కూడా ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అభ్యర్థులు, వారి మద్దతుదారులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ సమయంలో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పరిమిత సంఖ్యలోనే అభ్యర్థులు, మద్దతుదారులు కార్యాలయానికి రావాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అప్రమత్తంగా ఉంటారని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

చైర్‌పర్సన్ అభ్యర్థికి బీ-ఫారం అందజేత

చీరాల రక్షణ న్యూస్

చీరాల మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి శ్రీమతి హానీ స్పందనకు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి కేటాయించిన బీ-ఫారాన్ని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ తరఫున ఆమెకు బీ-ఫారం అందించారు. ఈ కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్, జనసేన నాయకుడు ఆమంచి రాజేంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ దిశానిర్దేశం

బాపట్ల రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికలపై ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలు నిరంతరం నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎన్నికల పరిశీలకులు, జిల్లా అధికారులు, నోడల్ అధికారుల వాహనాలకు ప్రత్యేక స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని సూచించారు. వెబ్‌కాస్టింగ్ పక్కాగా నిర్వహించడంతోపాటు, ఎన్నికల విధుల కోసం ఉద్యోగుల నియామక రాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఎన్నికల ప్రాధాన్యతను గుర్తించి అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, డీపీఓ డి. నాగేష్ కుమారి, సీపీఓ షాలేమురాజు, బాపట్ల మున్సిపల్ కమిషనర్ హాసిని, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ డాక్టర్ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో మల్లికార్జున రావు, పి. యశ్వంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటుతాం

బాపట్ల రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర పీసీసీ కార్యదర్శి గంటా అంజిబాబు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం బాపట్ల పట్టణంలోని పటేల్ నగర్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు మోహన్ రావు చేతుల మీదుగా పార్టీ అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ.. పేదల మధ్య పుట్టిన పార్టీ కాంగ్రెస్ అని, ప్రజారంజక పాలన అందాలంటే స్థానిక సంస్థల్లో మార్పు రావాలని అన్నారు. జిల్లాలోని అన్ని సెగ్మెంట్లలో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల బరిలో ఉన్నారని, ఇప్పటికే పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. మిషన్లతో అధికారంలోకి రావాల్సిన అవసరం తమ పార్టీకి లేదని, ప్రజల మద్దతుతోనే విజయం సాధిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు కాంగ్రెస్ ఇన్‌చార్జి సుధాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దోనేపూడి దేవరాజు, తాజుద్దీన్, చింత బాబూరావు, కోటేశ్వరరావు, కుమార్, రవి, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

16- 9- 26 rakshana_praja jyothi Medhak.qxd 10/20/2026 4:43 AM Page 4

సమాజ సేవకు దాతల సహకారం

కర్లపాలెం రక్షణ న్యూస్

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలకు స్పందించి విరాళాలు అందించిన దాతలకు కర్లపాలెం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, తహసీల్దార్ డి. రవీంద్ర కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. మండల రెడ్‌క్రాస్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు యారం చిన్నబ్బాయి రూ.10 వేలు, చింతాయపాలెంకు చెందిన దొప్పలపూడి చిన్న శ్రీనివాసరావు రూ.5 వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా దాతలను తహసీల్దార్ అభినందించారు.రెడ్‌క్రాస్ చైర్మన్ ఇనకొల్లు పోలీసురావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. రెడ్‌క్రాస్ జీవిత సభ్యత్వం రూ.1,100తో పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వైస్ చైర్మన్ తూనుగుంట్ల లలిత బాబు, కోశాధికారి ఎం. పరమానంద కుమార్, బి. జీవన్ జ్యోతి, పి. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా సహకరించాలి

రాజకీయ పార్టీలకు ఆర్‌ఓ విజయలక్ష్మి విజ్ఞప్తి

పొన్నూరు రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) వి. విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడవద్దని సూచించారు.పొన్నూరు మండల పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో సోమవారం ఆమె రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.అనంతరం ములుకుదురు చెక్‌పోస్ట్‌ను సందర్శించిన ఆర్ఓ విజయలక్ష్మి, అక్కడ జరుగుతున్న వాహనాల తనిఖీలను పరిశీలించారు. ఎన్నికల సమయంలో నిబంధనల అమలులో అప్రమత్తంగా ఉండాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవోతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై ఆర్వో సమీక్ష

రాజకీయ పార్టీల సమావేశంలో ఆర్వో విజయలక్ష్మి హెచ్చరిక

పొన్నూరు రక్షణ న్యూస్

ఎంపీటీసీ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రిటర్నింగ్ అధికారి వి. విజయలక్ష్మి సూచించారు. సోమవారం పొన్నూరు మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె ఎన్నికల విధివిధానాలను వివరించారు. నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియతో పాటు అభ్యర్థుల అర్హతలు, డిపాజిట్ మొత్తం, రిజర్వేషన్లు, ఓటరు జాబితాలో పేరు నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని, ప్రచార సభలు, ర్యాలీలు, వాహనాలు, మైకుల వినియోగానికి ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు.ఓటర్లను నగదు, బహుమతులతో ప్రలోభపెట్టరాదని, అక్రమ నగదు తరలింపును అరికట్టేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యర్థులు ఎన్నికల వ్యయ పరిమితిని పాటిస్తూ ఖర్చుల వివరాలను సక్రమంగా సమర్పించాలని కోరారు.ఈ సమావేశంలో తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సీఐ ఆర్.ఎస్. కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సమాచారం కోసం ప్రత్యేక కేంద్రం

గుంటూరు రక్షణ న్యూస్

నగరపాలక సంస్థ పరిధిలో సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడంతోపాటు ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు అదనపు ఎన్నికల అధికారి, నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు.నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు షిఫ్టుల వారీగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలు, ప్రక్రియ, ఇతర అంశాలపై సందేహాలను నివృత్తి చేసేందుకు ఈ హెల్ప్ డెస్క్ ఉపయోగపడుతుందని తెలిపారు.హెల్ప్ డెస్క్ నిర్వహణను సమన్వయం చేసేందుకు జీఎంసీ పశువైద్యాధికారి డాక్టర్ ఎం. నాగేశ్వరరావు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని చెప్పారు. ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

మూడు రకాల ఎన్నికలు.. సిబ్బంది ఒక్కటే!

మొదటి పేజీ తరువాయి

గుంటూరు,రక్షణ

మున్సిపాలిటీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు అందుబాటులో ఉన్న సిబ్బందినే వినియోగించనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.ఎం. సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు. ఎన్నికల విధులకు గైర్హాజరయ్యే ఉద్యోగులపై ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని, విధులకు హాజరుకాని ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో సిబ్బంది పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు.సోమవారం ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల విధుల నిర్వహణకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. సున్నిత, అతి సున్నిత పోలింగ్ కేంద్రాలను గుర్తించి, వాటిపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బంది నియామక ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి రూట్ మ్యాప్‌లను పక్కాగా సిద్ధం చేసుకోవాలని సూచించారు.రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలను రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాలెట్ పెట్టెలపై పోలింగ్ కేంద్రాల వారీగా గుర్తింపు స్టిక్కర్లు అతికించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని, అనుమతుల జారీ కోసం సింగిల్ డెస్క్ విధానాన్ని ప్రారంభించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, అదనపు ఎస్పీ జి.వి. రమణమూర్తి, రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారిబి.వి.నాగసాయికుమార్, అధికారులు పాల్గొన్నారు.